ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	512.90 (136.6461)	77,289	29,261
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.20 (3.82)	636.79	565.92
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	103.504 (1.09)	138	నిల్

చికెన్ ధరలు | లైవ్ : రూ.116 | డ్రెస్ : రూ.170 | స్కిన్‌లెస్ : రూ.192



శ్రీశైలం ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న నీరు



సాగర్ ప్రాజెక్టు

బిరబిరా సాగర్‌కు కృష్ణమ్మ

ఆధునికదేవాలయం నాగార్జునసాగర్ క్రమక్రమంగా జలకళను సంతరించుకుంటోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 6.50లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, రాష్ట్రానికి విద్యుత్‌ను అందించే నాగార్జునసాగర్ జలాశయానికి రెండేళ్ల తర్వాత వానాకాలంలో వరదపోటెత్తుతోంది. కృష్ణానదిపై ఎగువన ఉన్న ఆలమట్టి, నారాయణపూర్, జూరాల ప్రాజెక్టులతో పాటు తుంగభద్రపై ఉన్న హోస్పేట, సుంకేశుల నిండడంతో కృష్ణా, తుంగభద్ర నుంచి శ్రీశైలం రిజర్వాయర్‌కు 3.26 లక్షల క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో శ్రీశైలం గేట్లను సోమవారం ఎత్తడంతో దిగువన ఉన్న నాగార్జునసాగర్‌కు వరద మొదలైంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి)/నాగార్జునసాగర్

- శ్రీశైలం సహా ఎగువ ప్రాజెక్టులన్నీ నిండడంతో దిగువకు నీరు
- తెరుచుకున్న శ్రీశైలం క్రస్ట్‌గేట్లు
- సాగర్‌కు 1.32లక్షల క్యూసెక్కుల నీటి విడుదల

కృష్ణానదిపై ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు సోమవారం ఎత్తడంతో మంగళవారం ఉదయానికి నాగార్జునసాగర్‌కు లక్ష క్యూసెక్కుల వరద చేరనుంది. మంగళ, బుధ, గురువారాల్లో వరద మరింత పెరుగుతుందని ప్రాజెక్టు అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో వారం, పది రోజుల్లో నాగార్జునసాగర్ నిండే అవకాశం ఉందని, ఈ వారంలోనే ఎడమ కాల్వలకు సాగునీరు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. బోరుబావుల ఆధారంగా ఇప్పటికే ఎడమకాల్వ ఆయకట్టులో నారుమడులు చేసిన రైతులు, కాల్వకు నీరు విడుదల చేస్తే నాట్లకు సిద్ధమవుతున్నారు. కేఆర్ఎంబీ (కృష్ణానది యాజమాన్య బోర్డు) ఆదేశాలు వచ్చిన వెంటనే నీటి విడుదలకు సాగర్ ప్రాజెక్టు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. గత ఏడాది క్రాప్‌హాలిడే తర్వాత మళ్లీ సాగర్ ప్రాజెక్టు ద్వారా సాగునీరు విడుదలకు సన్నాహాలు చేస్తుండడం, జలాశయం నిండే పరిస్థితి ఉండటంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సాగర్‌కు తరలివస్తున్న వరద

శ్రీశైలం జలాశయ నీటిమట్టం గరిష్ఠస్థాయికి చేరువలో ఉండటం, ఎగువ నుంచి భారీగా ఇన్‌ఫ్లో వస్తుండటంతో ప్రాజెక్టు క్రస్ట్‌గేట్లు, పవర్‌హౌస్‌ల ద్వారా దిగువకు సోమవారం సాయంత్రం 1,39,194 క్యూసెక్కుల చొప్పున ప్రాజెక్ట్ అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్‌కు ఇప్పటికే 77వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా, ఈ వరద తోడైతే మంగళవారం ఉదయానికి 1.40లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రానుంది. వరద ప్రవాహం మరింత పెరుగుతుందని సాగర్ ప్రాజెక్ట్ అధికారులు అంచనా వేస్తున్నారు. ఎగువ కృష్ణానదికి, తుంగభద్రకు భారీగా వరద వస్తుండగా, ఆలమట్టి, నారాయణపూర్, జూరాలతో పాటు ఇటు తుంగభద్రపైన ఉన్న హోస్పేట, సుంకేశుల డ్యామ్‌లు నిండటంతో వచ్చిన వరదను వచ్చినట్లు శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు సైతం గరిష్ఠ నీటిమట్టానికి చేరువకావడంతో సోమవారం మధ్యాహ్నం క్రస్ట్ గేట్లు ఎత్తారు. వరద పెరిగే కొద్దీ ఎత్తే గేట్ల సంఖ్య పెంచారు. నాగార్జునసాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590అడుగులకు (312 టీఎంసీలు) ఇప్పటికే, 512.90 అడుగుల (136.64టీఎంసీలు) నీరు చేరింది. శ్రీశైలం నుంచి వరద ప్రవాహం ఇలాగే కొనసాగితే మరో రెండు రోజుల్లో నాగార్జునసాగర్ నీటిమట్టం 550 అడుగులకు చేరి నీరు క్రస్ట్‌గేట్లను తాకనుంది. అదే సమయంలో 150 టీఎంసీల నీరు నిల్వ ఉంటుంది. ఎగువనుంచి వరద ప్రవాహం పెరగడం, నీటిరాక ఎక్కువగా ఉండే అవకాశాలే కనిపిస్తుండడంతో సాగర్ 550 అడుగులకు చేరిన వెంటనే విద్యుదుత్పాదన ప్రారంభించడంతో పాటు, కుడి, ఎడమ కాల్వలకు నీరు విడుదల చేస్తారని అంచనా వేస్తున్నారు. వరదప్రవాహం ఇలాగే కొనసాగితే వారం నుంచి పది రోజుల్లో జలాశయం నిండనుంది. ఇప్పటికే ఎగువన అన్ని ప్రాజెక్టులు నిండుకుండల్లా నీటితో తొణికిసలాడుతుండగా, ఇకపై వచ్చే వరదంతా సాగర్‌కు చేరనుంది.

తెరుచుకున్న శ్రీశైలం గేట్లు

ఎగువ నుంచి భారీగా వరద వస్తుండడంతో సోమవారం మధ్యాహ్నమే శ్రీశైలం క్రస్ట్‌గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ఇప్పటికే కుడి, ఎడమ విద్యుదుత్పత్తి కేంద్రాల ద్వారా విద్యుదుత్పాదన చేస్తూ కుడి వైపున ఉన్న విద్యుత్ కేంద్రం నుంచి 27,823 క్యూసెక్కులు, ఎడమ వైపున ఉన్న విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కుల చొప్పున నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం నుంచి క్రస్ట్‌గేట్ల ద్వారా 76,056 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. సాయంత్రానికి శ్రీశైలం నుంచి దిగువకు 1,39,194 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదలచేస్తున్నారు. ఎగువన శ్రీశైలానికి వరద గంటగంటకూ పెరుగుతుండడంతో మరిన్ని క్రస్ట్‌గేట్లు తెరిచే అవకాశం ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. శ్రీశైలానికి ఎగువన జూరాల నుంచి క్రస్ట్‌గేట్ల ద్వారా, పవర్‌హౌస్ ద్వారా మొత్తం 3,26,731 క్యూసెక్కుల నీరు వస్తుంటే, మరోపక్కన తుంగభద్ర నుంచి 1,40,478 క్యూసెక్కుల నీరు వస్తోంది. మొత్తం శ్రీశైలానికి 4,67,210క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతోంది. శ్రీశైలం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులకు, ఇప్పటికే 878.90 అడుగుల నీటిమట్టం నమోదైంది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.807 టీఎంసీలకు 182.605 టీఎంసీల నీరు ఉంది. ఇన్‌ఫ్లో దాదాపు 40 టీఎంసీలకు పైగా వస్తుండడంతో క్రస్ట్‌గేట్లు, పవర్‌హౌస్ ద్వారా దిగువకు వదలడంతో పాటు, శ్రీశైలం ఆధారిత ఏపీ ప్రాజెక్టులకు, తెలంగాణకు చెందిన మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి నీటిని విడుదల చేసేందుకు ఇరిగేషన్ అధికారులు సన్నాహాలు చేశారు.

కృష్ణానది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



శ్రీశైలం ప్రాజెక్టు నుంచి క్రస్ట్‌గేట్లు, పవర్‌హౌస్‌ల ద్వారా దిగువ కృష్ణానదికి దాదాపు 1.40లక్షల క్యూసెక్కుల నీరు విడుదలవుతుండటంతో జిల్లాలోని కృష్ణానది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ప్రధానంగా సాగర్ బ్యాక్‌వాటర్ ఉండే ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఈత, దుస్తులు ఉతికేందుకు, చేపల వేటకు, పశువులను మేపేందుకు, నదిని దాటించేందుకు ప్రయత్నించవద్దు. ఎవ్వరూ నీరు నిలిచే ప్రాంతాలకు వెళ్లవద్దు. నదీపరివాహక ప్రాంత మండలాలు, గ్రామాల అధికారులు, ఉద్యోగులు ముందు జాగ్రత్తగా ప్రజలను అప్రమత్తం చేయాలి. ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవడంతోపాటు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలి.

- సి.నారాయణరెడ్డి, నల్లగొండ జిల్లా కలెక్టర్

సాగర్‌లో విద్యుదుత్పత్తి

సాగర్ జలాశయానికి ఎగువనుంచి వరద వస్తుండటంతో జెన్‌కో అధికారులు ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తిని ప్రారంభించారు. విద్యుదుత్పత్తి చేస్తూ 22,579 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో ఎనిమిది టర్బైన్లు ఉండగా, ఒక్కో టర్బైన్ ద్వారా 24గంటల్లో 110మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేయగల సామర్థ్యం ఉంది. ఎనిమిది టర్బైన్ల ద్వారా మొత్తం 880 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేయవచ్చు. సోమవారం రాత్రి తొమ్మిది గంటలకు ఎనిమిది టర్బైన్ల నుంచి విద్యుదుత్పత్తిని ప్రారంభించారు. గత నీటి సంవత్సరం (2022- 23)లో జలాశయంలో నీటిలభ్యత లేకపోవడంతో విద్యుదుత్పత్తి లక్ష్యాన్ని చేరుకోలేదు. గత ఏడాది ఎగువనుంచి సాగర్ జలాశయానికి వరద రాక లేనందున ప్రధాన జల విద్యుత్‌కేంద్రంలో విద్యుదుత్పత్తిని అనుకున్న స్థాయిలో చేయలేకపోయినట్లు జెన్‌కో అధికారులు తెలిపారు. ఈ నీటి సంవత్సరం (ఈ ఏడాది జూన్ 1వ తేదీ నుంచి వచ్చే ఏడాది మే 31వరకు) వరదలు అధికంగా ఉండటంతో విద్యుదుత్పత్తి లక్ష్యాన్ని చేరుకుంటామని జెన్‌కో అధికారులు ఆశాభావం చేస్తున్నారు.

నాలుగు సంవత్సరాలుగా విద్యుదుత్పత్తి ఇలా..

సంవత్సరం	లక్ష్యం	ఉత్పత్తి
	(మిలియన్ యూనిట్లలో)	
2019-20	1,289	1512.85
2020-21	1,290	1248.78
2021-22	1,535	2262.52
2022-23	1,500	167





రెండో విడత రుణమాఫీ రూ.1014కోట్లు

- 83,649మంది రైతులకు ప్రయోజనం
- నేటి నుంచి అమలు

నల్లగొండ, జూలై 29: రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత రుణమాఫీకి సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇప్పటికే రూ.లక్ష రుణమాఫీ ప్రక్రియను అమలు చేసిన అధికారులు ప్రభుత్వ ఆదేశాల మేరకు రెండో విడతలో జిల్లాలోని రైతులకు రూ.1.50లక్షల రుణమాఫీ చేయనున్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ ఆవరణలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రుణమాఫీ ప్రక్రియను లాంఛనంగా ప్రారంభించనున్నారు. అదే సమయంలో కలెక్టరేట్‌లో కలెక్టర్ సీ.నారాయణరెడ్డితో పాటు వ్యవసాయ, ఇతర శాఖల అధికారులు, కొంతమంది రైతులు సమక్షంలో రుణమాఫీ ప్రక్రియను ప్రారంభించనున్నారు.

భూమి ఉన్న ప్రతి రైతు కుటుంబానికి రూ.2లక్షల వరకు రుణమాఫీ వర్తిస్తుంది. అయితే ఈ పథకం స్వల్పకాలిక పంట రుణాల మాత్రమే వర్తిస్తుంది. 2018 డిసెంబరు 12వ తేదీనా మంజూరైన, రెన్యూవల్ అయినా రుణాలకు, 2023 డిసెంబరు 9వ తేదీ నాటికి బకాయి ఉన్న పంటరుణాలు మాత్రమే మాఫీ అవుతాయి. ఈ పథకంపై రైతుల సందేహాలు, ఇబ్బందులను పరిష్కరించేందుకు వ్యవసాయశాఖ ప్రత్యేకంగా పరిష్కార విభాగాన్ని ఏర్పాటుచేసింది. రైతులు వారి ఇబ్బందులను ఐటీ పోర్టల్ ద్వారా, మండల స్థాయిలో ఉన్న సహాయ కేంద్రాల ద్వారా వివరించవచ్చు. రైతుల అభ్యర్థనను సంబంధిత అధికారులు 30రోజుల లోపు పరిష్కరిస్తారు. జిల్లాలో 83,649మందికి రెండో విడత రుణమాఫీ రూ.1014,68,18,000 జరగనుంది. మొదటి విడతలో జిల్లాలో 83,124మంది రైతులకు రూ.454కోట్లకు పైగా రుణమాఫీ జరిగింది. మొదటి ఇంకా 3వేల మంది రైతుల ఖాతాలకు రుణమాఫీ నగదు జమకాలేదు. 80,124రైతుల ఖాతాల్లో రూ.లక్ష వరకు రుణమాఫీ పూర్తికాగా 3వేల మందికి మాత్రం ఇంకా రుణమాఫీ కాకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 3వేల మందిలో 1,800మందికి సంబంధించిన ఆధార్‌కార్డులతో వ్యవసాయశాఖ అధికారులు సంబంధిత యాప్‌లో పరిశీలించగా వీరందరికి లక్షకు పైగా రుణమాఫీ చేయాల్సి ఉండటంతో ఆగిందని, రెండో విడతలో చేస్తామంటూ సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. అయితే అది ఎంతవరకు వాస్తవమనేది తేలాల్సి ఉంది. ఇక మిగతా 1,200మంది రైతుల పరిస్థితి అయోమయంగా ఉంది. వారికి అసలు రుణమాఫీ ఎందుకు నిలిచిపోయింది అనేది కూడా యాప్‌లో ఎలాంటి సమాచారం లేకపోగా, అధికారులు కూడా సరైన సమాధానం చెప్పలేకపోతున్నారు.

యాదాద్రి జిల్లాలో రూ.165.87కోట్లు

యాదాద్రి జిల్లాలో రెండోవిడత రుణమాఫీలో 16,143మంది రైతులకు సంబంధించిన రూ.165,87,29,511 రుణాలు మాఫీ కానున్నాయి. మొదటి దఫాలో జిల్లాలోని 17 మండలాల్లో రూ.లక్ష వరకు రుణాలు తీసుకున్న 36,483మంది రైతుల రుణాలు మాఫీ అయ్యాయి.

సూర్యాపేట జిల్లాలో రూ.250 కోట్లు

సూర్యాపేట(కలెక్టరేట్): సూర్యాపేట జిల్లాలో రెండు విడతలు కలిపి 82,593 మంది రైతులను రుణమాఫీకి లబ్ధిదారులుగా అధికారులు గుర్తించారు. మొదటి విడతలో రూ.లక్ష లోపు 56,217 మంది రైతుల రూ.282.78కోట్ల రుణాలు మాఫీ అయ్యాయి. రెండో విడతలో రూ.1.50లక్షల వరకు రుణం తీసుకున్న 26,376 మంది రైతుల రూ.250కోట్లు మాఫీ అవ్వనున్నాయి. మంగళవారం నాడు ఈ మొత్తం రైతుల ఖాతాలో జమకానుంది. రెండు దఫాలు కలిపి రుణమాఫీ కింద రూ.532.78కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. రెండో విడతలో రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకు రుణమాఫీ కానుండగా రూ.2లక్షల రుణమాఫీ ఆగస్టు 15లోపు పూర్తి చేసేలా రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. కలెక్టరేట్‌లో ఉదయం 11గంటలకు లబ్ధిదారులైన రైతులతో పండగ వాతావరణంలో రెండో విడత రుణమాఫీ ప్రక్రియను ప్రారంభించనున్నట్లు తేజస్‌నందలాల్ పవార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆధునిక సాగు కోసం 'రైతు నేస్తం'
- రైతువేదికల్లో ప్రతీ మంగళవారం నిర్వహణ
- రైతుల సందేహాలు, కొత్త వంగడాలు, ఆధునిక యంత్రాలపై అవగాహన పెంపు

•7లో..

నీటి సరఫరా.. 15 రోజులకొకసారే!
- వర్షాకాలంలోనూ సమస్య
- సరిపడారాని మిషన్ భగీరథ నీరు
- పట్టించుకోని అధికారులు
- తిరుమలగిరి మునిసిపాలిటీలో దాహం కేకలు

•8లో..

సబ్ పోస్ట్‌మాస్టర్‌కు రాష్ట్ర స్థాయి బహుమతి
తృతీయ బహుమతి అందుకున్న ఉప్పలయ్య •8లో..

కబడ్డీలో అజయ్ ఆల్‌రౌండ్ ప్రతిభ
- రైడర్, డిఫెండర్‌గా రాణింపు
- తెలుగు ప్రో కబడ్డీ లీగ్‌కు ఎంపిక

•7లో..

సైబర్ చట్టాల సదస్సుకు వెంకటరమణరావు

తెలుగు సాహితీ కీర్తి కిరీటం సినారె



సినారె చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, మీలా మహాదేవ్

సూర్యాపేటటౌన్, జూలై 29: తెలుగు సాహితీ కీర్తి కిరీటం జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, సినీ రచయిత డాక్టర్ సి.నారాయణరెడ్డి అని సూర్యాపేట జిల్లా ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, సుధాకర్ పీవీసీ అధికనేత మీలా మహాదేవ్ అన్నారు. సి.నారాయణరెడ్డి జయంతి సందర్భంగా జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం రాత్రి జరిగిన స్వరా భిషేకం పాటల విభావరి కార్యక్రమంలో మాట్లాడారు. సాహితీ రంగానికి సినారె సేవలు అజరామరని కొనియాడారు. తెలుగు చిత్రసీమ, తెలుగు సినీపాటలు ఉన్న న్ని రోజులు సినారె పాటల రూపంలో బతికేఉంటారన్నారు. 3,500 సినీగీతాలు రచించిన సినారె తెలుగు ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేశారని తెలిపారు. కార్యక్రమంలో కళావేదిక అధ్యక్షుడు, కార్యదర్శులు జూనియర్ ఘంటసాల బుర్రి వెంకటేశ్వర్లు, సామాజికవేత్త గుండా రమేష్, ఎం.సరిత, పసుపులేటి సుజాత, విజయ, కవయిత్రి ఎన్‌సీ రోజా, హమీద్‌ఖాన్, ప్రభాకర్ ఉన్నారు.

ఫొటోగ్రాఫర్లు వృత్తిలో రాణించాలి

- సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



ఫొటో తీస్తున్న ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

సూర్యాపేట కల్చరల్, జూలై 29: మారుతున్న కాలానికి అణుగుణంగా ఫొటో, వీడియోగ్రాఫర్లు అత్యాధునిక టెక్నాలజీ అందిపుచ్చుకొని రాణించాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్ కేబీఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన ఫొటో ట్రేడ్ ఎక్స్పో కార్యక్రమంలో మాట్లాడారు. అన్నిరకాల కెమెరాలు, ఆల్బమ్స్‌లకు సంబంధించిన వస్తువులు ఒకే వేదికలో లభించడం అరుదన్నారు. తెలంగాణ రాష్ట్ర ఫొటో, వీడియోగ్రాఫర్ల సంఘం, ఫొటో టెక్ సంయుక్తంగా ఫొటోట్రేడ్ ఎక్స్పో జింగ్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు హుస్సేన్, ప్రధాన కార్యదర్శి రాపర్తి శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారి మునగాల శైలేందర్, వెంకరెడ్డి, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు లాలూ, శ్రీమన్నారాయణ, కృష్ణ, మోహన్‌రెడ్డి, మాధవరెడ్డి, అభిమన్యు, భూపాల్, ప్రకాష్, మధు తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌కు పక్కా భవనాలు నిర్మించాలి

కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణ



నకిరేకల్ హాస్టల్‌లో విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కేవీపీఎస్ నాయకులు

నకిరేకల్, జూలై 29: నకిరేకల్‌లోని ఎస్సీ, బీసీ బాలికల ప్రభుత్వ హాస్టల్‌కు పక్కాభవనాన్ని నిర్మించాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వంటెపాక కృష్ణ డిమాండ్ చేశారు. హాస్టళ్ల సర్వేలోభాగంగా ఆదివారం స్థానిక ఎస్సీ, బీసీ బాలికల ప్రభుత్వ హాస్టళ్లను ఆయన సందర్శించి విద్యార్థినులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అద్దె భవనాల్లో అరకొర వసతులతో బాలికలు అవస్థలు పడుతున్నారని అన్నారు. ప్రస్తుతం ఉన్న బిల్డింగ్ రేకుల షెడ్డు కారణంగా వర్షం వచ్చినప్పుడు కురుస్తోందని విద్యార్థినులు వాపోయారు. దీంతో చాలామంది విద్యార్థినులు హాస్టల్‌కు దూరమవుతున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం పక్కా భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు సుధీర్, ఏర్పుల నరేష్, వి.నాగార్జునపాల్గొన్నారు.

ఆలయ ఉద్యోగుల్లో బదిలీల ఉత్కంఠ

భువనగిరి అర్బన్, జూలై 29: బదిలీల ప్రక్రియ యా దగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఉద్యోగుల్లో ఉత్కం ఠ రేపుతోంది. ముందస్తుగా ప్రకటించినట్లుగానే ఈ నెల 29వ తేదీ వరకు కమిషనర్ కార్యాలయం నుంచి బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడుతాయని అంతా భావించారు.

ఈ నెల 27నే బదిలీల ప్రక్రియ పూర్తయి ఉత్తర్వులు జారీ తరువాయి అని ప్రచారం జరగగా, శాసనసభ బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు ఉత్తర్వులు నిలిచిపోవచ్చని మరోలా ప్రచారం సాగింది. 40శాతం బదిలీల్లో ఆలయం నుంచి 25మంది వివిధ కేటగిరీల్లోని ఉద్యోగులు బదిలీ కానున్నారు. కానీ, వీరికి ఎట్టి పరిస్థితుల్లోనూ సోమవారం సాయంత్రం వరకు ఉత్తర్వులు అందుతాయని ఉద్యోగులు తర్జన భర్జన పడ్డారు. బదిలీలు తప్పవని భావించిన కొందరు ఉద్యోగులు బదిలీకి మానసికంగా సిద్ధం కాగా, రాష్ట్ర దేవాలయాల జేఏసీ చైర్మన్, నాయకుల పైరవీలతో రెండు రోజుల పాటు జాప్యం జరిగిందని భావించారు. ఈ నెల 22వ తేదీన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను ఆలయాల ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు ఆయన నివాసంలో కలిసి స్వామివారి లడ్డు ప్రసాదం అందజేసి బదిలీలు నిలిపివేయాలని కోరినట్లు సమాచారం. సీఎం రేవంత్‌రెడ్డిని సంప్రదించి న్యాయం జరిగే విధంగా చూస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు జేఏసీ నాయకులు తెలిపారు. దీంతో బదిలీల పట్ల స్థానికంగా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడే పుట్టి, పెరిగి, ఇక్కడే ఉద్యోగం పొంది, ఇక్కడే ఉద్యోగ విరమణ చేసిన దృష్ట్యా తప్పకుండా బదిలీ చేయాల్సిందేనని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ రెండో రోజుల క్రితం పత్రికా ప్రకటన విడుదల చేశారు.

గుట్టలో హరిహరులకు విశేష పూజలు
ఆలయ ఖజానాకు రూ.18,74,858 ఆదాయం •7లో..

ఉమ్మడి జిల్లాలో పలువురు ఎస్ఐల బదిలీలు

నల్లగొండక్రైం, జూలై 29: ఉమ్మడి జిల్లాలో పలువురు ఎస్ఐలను బదిలీ చేస్తు హైదరాబాద్ రెండో జోన్ ఐజీ సత్యనారాయణ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన ఎస్ఐల వివరాలు ఇలా..



పోలీస్‌స్టేషన్	ఎస్ఐ	బదిలీ ప్రాంతం
చిట్యాల	డి.సైదాబాబు	నల్లగొండ రూరల్
నల్లగొండ రూరల్	జె.శివకుమార్	నల్లగొండ వీఆర్
మిర్యాలగూడ-1	శ్రీనునాయక్	తిరుమలగిరి సాగర్
తిరుమలగిరిసాగర్	నారాయణరెడ్డి	నల్లగొండ వీఆర్
సూర్యాపేట వన్‌టౌన్	సీహెచ్.బాలకృష్ణ	అర్వపల్లి
అర్వపల్లి	ఎస్‌కె.యాకుబ్	సూర్యాపేట వీఆర్
నల్లగొండ డీటీసీ	డి.క్రాంతికుమార్	నార్కట్‌పల్లి
నార్కట్‌పల్లి	ఎన్.అంతిరెడ్డి	నల్లగొండ వీఆర్
హాలియా	ఎస్.ధర్మ	చిట్యాల
నల్లగొండ సీసీఎస్	ఐలయ్య	నాగారం
నార్కట్‌పల్లి	వి.సురేష్	తిరుమలగిరి

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

● పీఏపల్లి మండలం చిలకమర్రిలో ఘటన


శివ(ఫైల్ ఫొటో)

పెద్దఅడిశర్లపల్లి, జూలై 29: విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి చెందాడు. ఈ ప్రమాదం నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం చిలకమర్రి గ్రామ పంచాయతీలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం... కొండమల్లేపల్లికి చెందిన పర్వతం శివ (16) స్థానిక శ్రీకాంతి జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో తన మిత్రులతో కలిసి చిలకమర్రి సమీపంలో సంజీవని ఎడ్యుకేషన్ సొసైటీ దగ్గర గల ఫంక్షన్‌హాల్‌లో ఎలక్ట్రికల్ వర్క్‌కు సంబంధించిన పనికి వెళ్లాడు. అక్కడ పనులు నిర్వహిస్తుండగా విద్యుత్ వైర్లు తగిలి విద్యుదాఘాతానికి గురై స్పృహ కోల్పోయాడు. గమనించిన మిత్రులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. పేదరికం వల్ల కూలీ పనులకు వెళ్తూ కుటుంబ జీవనం సాగిస్తూ పిల్లలను చదివించుకుంటున్నామని, తమ కొడుకు చదువుకొని ఆసరాగా ఉంటాడనుకుంటే కళ్ల ముందు విగతజీవిగా మారాడని తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. బాలుడి తండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నర్సింహులు తెలిపారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి: ఎస్‌ఐ

కట్టంగూరు, జూలై 29: ఆన్‌లైన్ మోసాలబారిన పడకుండా యువత జాగ్రత్త పడాలని కట్టంగూరు ఎస్‌ఐ ఎన్.శ్రీనివాస్ సూచించారు. సోమవారం కట్టంగూరు సెంటర్‌లో యువతకు ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ శ్రీను మాట్లాడుతూ కట్టంగూరు పరిసర ప్రాంతాల్లో గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా సరే గంజాయి విక్రయించినట్లయితే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

సినారె సాహిత్యం అద్భుతం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న సంఘం నాయకులు

నల్లగొండ కల్చరల్, జూలై 29: జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి సాహిత్యం అద్భుతమని పలువురు వక్తలు పేర్కొన్నారు. సి.నారాయణరెడ్డి జయంతి సందర్భంగా సోమవారం పట్టణంలోని పెన్షనర్స్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సినారె రాసిన పాటలపై పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో 22 మంది గాయనీ, గాయకులు పాల్గొని పాటలను అద్భుతంగా ఆలపించారు. పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన గాయకులను విజేతలుగా ప్రకటించారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గజవెల్లి సత్యం, యాదవాస్‌దేవ్ విజేతలైన మారోజు కేశవాచారికి ప్రథమ, తాడూరు రమేష్‌కు ద్వితీయ, మాచర్ల మహేశ్వర్‌కు తృతీయ బహుమతులు అందజేశారు. నాయకులు జెల్లా పుల్లయ్య, రమేష్, రవిప్రసాద్, ప్రకాష్, గోపాల్‌రెడ్డి, సుధాకర్, నీరజ, పద్మకుమారి, అలీ, రామలింగం, మోహన్‌రావు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగురాలిపై లైంగికదాడి

శాలిగౌరారం, జూలై 29: తన ఇంటికి సమీపంలో ఉంటున్న మానసిక దివ్యాంగురాలిపై ఓ వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలో ఈ సంఘటన జరిగింది. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి సమీపంలో ఉన్న ఓ గ్రామానికి చెందిన దంపతులు కూలిపని చేస్తూ జీవనం సాగిస్తుండగా, వారికి మానసిక దివ్యాంగురాలైన(20) కుమార్తె ఉంది. వారి ఇంటికి సమీపంలో నివసించే దశరథ(50) తాపీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం బాధితురాలి ఇంట్లో ఎవరూ లేకపోవడం గమనించిన దశరథ ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఇంతలోనే దివ్యాంగురాలి తల్లి ఇంటికి చేరుకోవడాన్ని గమనించి అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితురాలి తల్లి సోమవారం శాలిగౌరారంలో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయటంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కొండల్‌రెడ్డి తెలిపారు. నిందితుడు దశరథను అదుపు లోకి తీసుకుని, బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం నల్లగొండకు తరలించారు. దశరథకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

తైక్వాండోలో బంగారు పతకాలు



తైక్వాండోలో పతకాలు అందుకున్న నల్లగొండ జిల్లా క్రీడాకారులు

నల్లగొండ కల్చరల్, జూలై 29: హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడ కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి స్టేడియంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర తైక్వాండో క్యాడెట్, జూనియర్ చాంపియన్‌షిప్ పోటీల్లో నల్లగొండకు చెందిన తైక్వాండో క్రీడాకారులు ప్రతిభ కనబర్చారు. నాలుగు బంగారు, మూడు రజత, ఆరు కాంస్య పతకాలు సాధించి సత్తా చాటారు. వాల్కి శ్రేష్ట చంద్ర, గుండాల అక్షయ, జె.రేష్మగౌడ్, పి.సోహం బంగారు, అబ్దుల్ ముక్షిద్, ఎం. సౌమిత్ర, అబ్దుల్ ముహీత్ సిల్వర్, సదాశివ, షేక్ ఫిరోజ్, రాహుల్ బిట్టు, బి.యశ్వంతి, మహ్మద్ సులేమాన్ మాలిక్ కాంస్య పతకాలు సాధించారు. బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు ఆగస్టు 18 నుంచి 20వ తేదీ వరకు మహారాష్ట్రలో జరిగే జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొంటారు. పతకాలు సాధించిన క్రీడాకారులను ది తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు పి. విఠల్‌బాబు, ప్రధాన కార్యదర్శి ఎం.డీ. యూనుస్‌కమాల్, కోశాధికారి అంబటి ప్రణీత్ తదితరులు అభినందించారు.

కబడ్డీలో అజయ్ ఆల్‌రౌండ్ ప్రతిభ

● రైడర్, డిఫెండర్‌గా రాణింపు ● తెలుగు ప్రో కబడ్డీ లీగ్‌కు ఎంపిక



బీబీనగర్, జూలై 29: కబడ్డీపై ఆసక్తి పెంచుకున్న ఆ యువకుడు పట్టు విడవకుండా సాధన చేస్తూ ఆల్‌రౌండర్ ప్రతిభతో రాణిస్తున్నాడు. తెలుగు రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహించనున్న ప్రోకబడ్డీ లీగ్‌కు (టీపీకేఎల్)కు ఎంపికయ్యాడు యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం జంపల్లి గ్రామానికి చెందిన గొలనుకొండ విజయ్. గొలనుకొండ గోపాల్,సాలమ్మ దంపతులకు మొదటి సంతానం కూతురు కాగా, రెండో సంతానం అజయ్. తండ్రి గోపాల్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విజయ్ 12ఏళ్ల వయసులో ఉన్నప్పుడు తల్లి సాలమ్మ అనారోగ్యంతో చనిపోయింది. తల్లిదండ్రులను కోల్పోయిన అజయ్, అతని సోదరిని నాయనమ్మ అక్కున చేర్చుకుంది. గ్రామస్థుల సహకారంతో అజయ్‌ను భువనగిరిలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలలో 6వ తరగతిలో చేర్పించారు. అక్కడే ఇంటర్ పూర్తిచేశాడు. 2021లో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతుండగా వరంగల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. 2023లో ఏషియన్ స్పోర్ట్స్ అండ్ ఫిజికల్ ఫిట్‌నెస్ బోర్డు ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచి ఫేయిర్ ప్లే అవార్డు దక్కించుకున్నాడు. 2024మార్చి నెలలో పుల్లారెడ్డి స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో కూడా రైడర్, డిఫెండర్‌గా ఆల్‌రౌండర్‌గా అవార్డు అందుకున్నాడు. తెలుగు రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహించనున్న తెలుగు ప్రో కబడ్డీ లీగ్‌కు విజయ్ ఎంపికయ్యాడు. హైదరాబాద్ ప్లేయర్‌గా శిక్షణ పొందుతున్నాడు.

సైబర్ చట్టాల సదస్సుకు వెంకటరమణరావు



నల్లగొండ క్రైం, జూలై 29: సైబర్ నేరాల చట్టాలపై అమెరికాలోని న్యూయార్క్ నగరంలో నిర్వహించే సమ్మిట్ ఆఫ్ ది ఫ్యూచర్ కాన్ఫరెన్స్‌కు నల్లగొండ జిల్లాకు చెందిన సైబర్ నేరాల విశ్లేషకుడు, ఐక్యరాజ్య సమితి అకాడమిక్ కౌన్సిల్ సభ్యుడు ఆదోని వెంకటరమణరావు ఎంపికయ్యారు. అంతర్జాతీయ నేరాలపై చట్టాల గురించి సెప్టెంబరు 22,23వ తేదీల్లో నిర్వహించే కాన్ఫరెన్స్‌కు స్పెషల్ అక్రెడేషన్ ద్వారా ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయం వెంకటరమణరావుకు ఆహ్వానం పంపింది. సదస్సుకు ఎంపికైన ఆయనను నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

ఆధునిక సాగు కోసం 'రైతు నేస్తం'

● రైతు వేదికల్లో ప్రతీ మంగళవారం
● రైతుల సందేహాలు, కొత్త వంగడాలు, ఆధునిక యంత్రాలపై అవగాహన పెంపు



భువనగిరి మండలం అనాజీపురం రైతువేదికలో రైతు నేస్తం కార్యక్రమానికి హాజరైన రైతులు(ఫైల్)

భువనగిరి రూరల్, జూలై 29: వ్యవసాయ రంగంలో ఆధునిక పరిజ్ఞానం అన్నదాతలకు మరింత చేరవయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పంటల సాగులో మెళకువలు, ఆధునిక పద్ధతులపై క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పించడంతో పాటు సందేహాలను నివృత్తి చేసేందుకు ప్రభుత్వం రైతు నేస్తం కార్యక్రమానికి చేపట్టింది. మార్చి నెల నుంచి ప్రతీ మంగళవారం నిర్వహిస్తోంది. ఇప్పటి వరకు నియోజక వర్గంలోని ఓ రైతు వేదికలో మాత్రమే కొనసాగగా, ఇక నుంచి ప్రతీ రైతు వేదికలోనూ ఈ కార్యక్రమం కొనసాగేలా అధికారులు ఏర్పాట్లుచేశారు. రైతుల ముంగిటకు ఆధునిక విజ్ఞానాన్ని ప్రభుత్వం తీసుకువస్తుంది. ఇందుకోసం రైతు వేదికల్లో టీవీలు, కంప్యూటర్లు, మైకులు, ఇన్వర్టర్లు, నెట్ సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతీ మంగళవారం శాస్త్రవేత్తలు, వ్యవసాయ ఉన్నతాధికారులు నేరుగా రైతులతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ముఖాముఖి నిర్వహించడంతో పాటు సాగులో మెళకువలు, వ్యవసాయరంగంలో వస్తున్న మార్పులు,



వీడియో కాన్ఫరెన్స్ కోసం ఏర్పాటు చేసిన టీవీ, సీసీ కెమెరా

పంటల తెగుళ్ల నివారణ, చీడపీడల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించనున్నారు. ఆధునిక పద్ధతులు, యాంత్రీకరణ, నూతన వంగడాలపై రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందించేలా కార్యక్రమం రూపొందించారు. వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలపై కూడా ఇందులో చర్చిస్తారు. రెండు రోజుల ముందే రైతు నేస్తంలో ఏ అంశంపై చర్చ ఉంటుందో జాబితా ప్రకటిస్తారు. ఈ అంశాలను వ్యవసాయ అధికారులు రైతులకు అందచేసి రైతులు హాజరై తమ సందేహాలను నివృత్తి చేసుకునేలా కార్యక్రమం రూపొందిస్తున్నారు.

యాదాద్రి భువనగిరి జిల్లాలో 17 చోట్ల

యాదాద్రి భువనగిరి జిల్లాలో ఐదు వేల ఎకరాలకు ఒక వ్యవసాయ విస్తరణ అధికారిని నియమించారు. అయితే జిల్లాలో 92 రైతు వేదికలు ఉన్నాయి. ప్రస్తుతం జిల్లాలోని 17 మండలాలలో 17 రైతువేదికల్లో రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు శ్రీకారంచుట్టారు. అందుకోసం అవసరమైన పరికరాలను కూడా సమకూర్చారు. భువనగిరి మండలంలో అనాజీపురం, బీబీనగర్ మండలంలో రాయరావుపేట, పోచంపల్లి మండలంలో బీమనపల్లి, వలిగొండ మండల కేంద్రంలో, రాజాపేట మండల కేంద్రంలో, ఆలేరు మండలంలో కొలనుపాక, ఆత్మకూర్ మండల కేంద్రంలో, తుర్కపల్లి మండలంలో మాదాపురం, యాదగిరిగుట్ట మండలంలో మాసాయిపేట, గుండాల మండల కేంద్రంలో, అడ్డగూడూరు మండల కేంద్రంలో, బొమ్మలరామారం మండల కేంద్రంలో, మోటకొండూరు మండలంలో చాడలో, మోత్కూరు మండలం పాటిమట్లలో, రామన్నపేట మండల కేంద్రంలో, నారాయణపూర్ మండల కేంద్రంలో, చౌటుప్పల్ మండలంలో జేకేసారం రైతు వేదికలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. రైతులు హాజరై సలహాలు, సూచనలు పొందేలా స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఈ కార్యక్రమాల ద్వారా రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రైతు నేస్తానికి అన్ని ఏర్పాట్లు చేశాం



ఆధునిక పరిజ్ఞానాన్ని అన్నదాతలకు చేరువ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. జిల్లాలోని 17 మండలాలకు సంబంధించి ఒక్కో రైతువేదికను ఎంపిక చేసి రైతు నేస్తం నిర్వహణకు ఏర్పాట్లుచేశాం. ఆయా వేదికల్లో అందుకు అవసరమైన ఏర్పాట్లు చేశాం. సాగులో రైతులకు మెళకువలు, ఆధునిక పద్ధతులపై అవగాహన కల్పిస్తాం. అదేవిధంగా శాస్త్రవేత్తలు, రాష్ట్రస్థాయి అధికారులు నేరుగా రైతులతో ముఖాముఖి కూడా చేపట్టేందుకు వీలు ఉంటుంది.

అనురాధ, జేడీఏ, యాదాద్రిభువనగిరి జిల్లా.

హరిహరులకు విశేష పూజలు

భువనగిరి అర్బన్, జూలై 29: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి కొండపై సోమవారం హరిహరులకు విశేష పూజలు కొనసాగాయి. స్వయంభూ స్వామిఅమ్మవారికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమ రీతిలో, పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామివారికి శివాలయంలో స్ఫటికమూర్తులకు శైవాగమశాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామిఅమ్మవార్లను మేల్కొలిపిన అర్చకస్వాములు మూల మూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవ మూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన పూజారులు విశ్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం వేళ అలంకార వెండీ జోడు సేవలు, సహస్రనామార్చనలు ఆగమశాస్త్రరీతిలో కొనసాగాయి. శివాలయంలోని ముఖమండపంలో స్ఫటిక మూర్తులను అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. శివపార్వతుల ఉత్సమూర్తులకు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి, తిరువీధుల్లో ఊరేగించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయన ఖజానాకు రూ. 18,74,858 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.



శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వ్యాధుల కాలం.. అప్రమత్తత అవసరం!



చండూరులో కుండీలో మురికి నీటిని తొలగిస్తున్న ఆరోగ్యసిబ్బంది

చండూరు, జూలై 29 : వానాకాలం వ్యాధులు ప్రబలే కాలం. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో సీజనల్ వ్యాధులు వ్యాప్తిచెందకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యసిబ్బంది సూచిస్తున్నారు. ఇంటి పరిసరాల్లో నీటిని నిల్వ ఉండకుండా జాగ్రతలు తీసుకోవాలంటున్నారు. లేకుంటే దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా వంటి జ్వరసంబంధిత ఇబ్బందులతో పాటు చికున్‌గున్యా, బోధకాలు వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. కలుషిత నీటితో డయేరియా, టైఫాయిడ్, ఫ్లూ వంటి వ్యాధులు సోకుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

వైరల్ ఫీవర్ కారణాలు

వైరల్‌ఫీవర్ ఒకరి నుంచి ఒకరికి గాలి ద్వారా వ్యాప్తి చెందుతుంది. కొన్నిసార్లు శ్వాస నాళాల ద్వారా వ్యాపిస్తుంది. కలుషిత నీరు, ఆహారం తీసుకున్నప్పుడు వైరల్ ఫీవర్ విజృంభిస్తుంది.

లక్షణాలు

వైరల్‌ఫీవర్‌తో బాధపడేవారిలో జ్వరం, ఒళ్లు నొప్పులు, నీరసం, ఒంటిపై దద్దుర్లు, వికారం, తల నొప్పి, ఆకలి మందగించడం, గొంతు నొప్పి, జలుబు, దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తాయి.

వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు

• ఇంటిని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. • మురుగు నీరు నిల్వలేకుండా చూసుకోవాలి. • కాచి చల్లార్చిన నీటిని తాగాలి. • వేడివేడి ఆహారం తీసుకోవాలి. • తాజా పండ్లను తీసుకోవాలి. • దోమల తెరలను వాడాలి. • కిటికీలకు తెరలను ఏర్పాటుచేసుకోవాలి. • జ్వరం వచ్చిన వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. • బయట ఆహారం తీసుకోవద్దు. • ముఖ్యంగా పానీపూరీ, జంక్ ఫుడ్ తీసుకోకూడదు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



వ్యాధులు సోకకుండా పరిశుభ్రంగా ఉండాలి. అప్పుడో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ఆరోగ్య సూత్రాలను ఖచ్చితంగా పాటించాలి. వేడి ఆహారాన్ని తీసుకోవాలని. ఈగలు, దోమలు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటే రోగాలు దరిచేరవు.

డాక్టర్ మాస రాజు, వైద్యాధికారి, చండూరు

శిథిలావస్థకు చేరిన రాజుల నాటి కట్టడం



షోకేస్



కూలేదశలో ఉన్న ఖిల్లాపై ఉన్న గోడ


కనుమరుగు కాకముందే..

కాపాడుకుందాం



చెక్కు చెదరని పురాతన కట్టడం





భువనగిరి ఖిల్లా

భువనగిరి ఖిల్లా స్థావరంగా పలువురు రాజులు ఈ ప్రాంతం నుంచి పాలన సాగించారు. హైదరాబాద్‌కు కూతవేటు దూరంలో భువనగిరి ఖిల్లా ఉంది. యాదగిరిగుట్ట, వరంగల్ వైపు వెళ్లే పర్యాటకులకు ఏకశిల కోటను ఆకర్షణీయంగా, ఆహ్లాదంగా కనిపిస్తోంది. కొన్నేళ్లుగా పర్యాటకుల తాకిడి పెరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం భువనగిరి కోట అందాలు శిథిలావస్థకు చేరుతున్నాయి. కేంద్ర, రాష్ట్రాల నుంచి అనేకసార్లు అధికారులు, ప్రజాప్రతినిధులు ఖిల్లాను సందర్శించారు. అభివృద్ధి పనులను చేపడతామని ఆర్భాటంగా ప్రకటనలు గుప్పించారు. కానీ అవి ఆచరణనలో సాధ్యం కావడం లేదు. ప్రకటనలకు తప్ప పనులు చేయడం లేదు. ఖిల్లా పై సౌకర్యాలు లేక సందర్శకులు ఇబ్బందులు పడుతూ వెళ్తున్నారు. చరిత్ర కనుమరుగు కాకుండా కోటను అందంగా తీర్చిదిద్దాల్సి ఉంది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్ యాదాద్రి



కంపచెట్లతో మూసుకుపోయిన మెట్ల మార్గం



కూలిన కోటపై కట్టిన రక్షణ గోడలు

విషపురుగులతో తస్మాత్ జాగ్రత్త



● వానాకాలంలో ఆరుబయటకు పాములు, తేళ్లు
● పొలాలకు వెళ్లే రైతులు జాగ్రత్తలు పాటించాలి

వర్షాకాలం వచ్చిందంటే విషపురుగుల బెడద అధికంగా ఉంటుంది. పాములు, తేళ్లు, మండ్రగబ్బలు వాటి ఆవాసాల్లోకి నీరు చేరడం, చల్లటి వాతావరణం ఉండటంతో బయటకువచ్చి సమీప నివాసాలు, ఇతర ఆవాసాల్లోకి వస్తుంటాయి. వీటి బారిన పడి మనుషులతో పాటు మూగజీవాలు ప్రాణాలు కోల్పోతుంటారు. ప్రధానంగా పాములు, తేళ్లతో ఈ కాలంలో జాగ్రత్తగా ఉండాలి. పొలం పనులకు వెళ్లే అన్నదాతలతో పాటు కూలీలు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

- సూర్యాపేట టౌన్

కాటేసిన 20 నిమిషాల్లో..

పాము విషం క్షణాల్లో రక్తకణాల్లో కలుస్తుంది. నాగుపాము విషం కాటేసిన సుమారు 20 నిమిషాల్లోపే శరీరంలోకి ఎక్కుతుంది. రక్తపింజర విషం రెండు గంటల తర్వాత ప్రభావం చూపిస్తుంది. ఒక్కో పాము విషం తీవ్రతను బట్టి దాని ప్రభావం ఉంటుంది. పాము కాటేసిన వెంటనే ఆస్పత్రిలో చేరాలి. అదేవిధంగా తేలు, జెర్రిపోతు, నీరుకట్ట కాటేసినప్పటికీ విషం తక్కువగా ఉంటుంది. అయితే కాటేసిన చోట చికిత్స కోసం ఆసుపత్రికి వెళ్లడం తప్పనిసరి.

ఆందోళన చెందవద్దు

పాముకాటుకు గురైన వారు మొదటగా ఆందోళన చెందకుండా ఉండాలి. ఆందోళనకు గురైతే గుండెపోటుకు దారితీస్తుంది. పాముకాటుతో ఉన్న భాగం నుంచి శరీరంలోకి రక్తప్రసరణతో విషం వ్యాప్తి చెందే అవకాశం ఉంది. ప్రాథమిక చర్యగా కాటు వేసిన ప్రదేశం పైభాగంలో గుడ్డతో బలంగా కట్టుకట్టాలి. ఆ వెంటనే చికిత్సకోసం ఆసుపత్రికి తీసుకెళ్లాలి. ఏపాము కాటేసిందో స్పష్టంగా వైద్యుడికి చెబితే దానికి సంబంధించిన చికిత్స అందిస్తారు.

విషసర్పాలు రెండు రకాలు

విషసర్పాలు రెండు రకాలు. ఒకటి న్యూరోటాక్సిన్ రకం నాగుపాము, కట్లపాము కాగా రెండో రకం హిమోటాక్సిన్ అనగా రక్తపింజర పాము. న్యూరోటాక్సిన్‌తో నోటి ద్వారా నురగ వచ్చి శ్వాస ఆడక మృతి చెందే ప్రమాదం ఉంది. హిమోటాక్సిన్‌తో రక్తనాళాలలో కణజాలం నశించి కాటుబడిన భాగంలో వాపు వస్తుంది. పక్కపక్కన రెండు దంతాలుగా కాటు వేస్తే అది కచ్చితంగా విష పాము అనుకోవాలి.

అందుబాటులో యాంటీ స్నేక్‌వీనమ్ ఇంజక్షన్లు

సూర్యాపేట జిల్లాలోని అన్నిస్థాయిల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో యాంటీ స్నేక్ వీనమ్ ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయి. జిల్లాలో 2023లో విషపురుగులు కరిచిన కేసులు 21దాకా నమోదుకాగా ఈ ఏడాది ఇప్పటివరకు రెండు కేసులు నమమోదయ్యాయి. అయితే ప్రాణాపాయం సంభవించలేదు.

పాము కరిస్తే లక్షణాలు

మనిషిని విషపూరితమైన పాము కరిస్తే శరీరం నీలం రంగులోకి మారుతుంది. రక్తపోటు తక్కువగా ఉంటే స్పృహ కోల్పోతారు. పాము కరిచిన చోట నొప్పి, వాపు ఉంటుంది. కొందరిలో పొక్కులు, దద్దుర్లు కనిపిస్తాయి. నోటి నుంచి తెల్లని నురగ వస్తుంది. ఆయాస పడతారు. శరీరమంతా చెమటలు పట్టి కోమాలోకి వెళ్తారు. గుండె సాధారణ స్థాయి కన్నా రెట్టింపుగా కొట్టుకుంటుంది. ఆ క్షణంలో వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

'సకుర'లో రాష్ట్రస్థాయి పోటీలకు సాయిశ్రీ ఎంపిక



గరిడేపల్లి, జూలై 29: ఇండియా, జపాన్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం సకురలో సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లి మోడల్ కాలేజీకి చెందిన నక్క సాయిశ్రీ రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు గైడ్, జువాలజీ లెక్చరర్ పాటలీ చంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సూర్యాపేటలోని బాల్ భవన్‌లో శుక్రవారం జిల్లా వ్యాప్తంగా అన్ని జూనియర్ కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన పోటీ పరీక్షలో నక్క సాయిశ్రీ ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైందన్నారు. హైదరాబాద్‌లో మంగళవారం జరిగే రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలో సాయిశ్రీ పాల్గొననుందని తెలిపారు. సకురా ప్రోగ్రాంలో భాగంగా జపాన్‌లో మూడు వారాల పాటు నిర్వహించే ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం కోసం ప్రతి రాష్ట్రం నుంచి ఐదు మంది విద్యార్థులను ఎంపిక చేస్తారన్నారు. రాష్ట్ర స్థాయికి సాయిశ్రీ ఎంపిక కావడంపై కాలేజీ ప్రిన్సిపాల్, లెక్చరర్లు, తోటి విద్యార్థులు అభినందనలు తెలిపారు.

బందెల దొడ్లో ఉంచారు.. మేత వేయడం మరిచారు

●నీరసించి కుప్పకూలి చూడి ఆవు మృతి ● సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో ఘటన

హుజూర్‌నగర్, జూలై 29: బందెల దొడ్లో ఉంచిన ఆవుకు 10రోజులుగా మేత వేయనందున కుప్పకూలి మృతి చెందింది. ఈ ఘటన సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ మెయిన్ రోడ్లపై తిరుగుతున్న ఆవులను మునిసిపాలిటీ సిబ్బంది 10 రోజుల క్రితం బందెల దొడ్లోకి తరలించారు. రైతులు అవులను తీసుకువెళ్లనందున మేత లేక తీవ్ర ఇబ్బందులు పడ్డాయి. బందెల దొడ్లోని ఆవులను మునిసిపల్ సిబ్బంది ఆదివారం సాయంత్రం వదిలిపెట్టారు. కాగా, పట్టణానికి చెందిన నరేష్‌కు చెందిన చూడి ఆవు 10రోజులుగా బందెల దొడ్లో ఉంది. మేత లేనందున తీవ్ర అస్వస్థతకు గురై ఇంటికి వెళ్లే క్రమంలో పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ టవర్ సమీపంలో అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందింది. ఆవు కళేబరాన్ని మునిసిపాలిటీ అధికారులు ట్రాక్టర్ ఎక్కించి పట్టణంలోని డంపింగ్ యార్డుకు తరలించారు. ఆవు యజమాని నరేష్ మాట్లాడుతూ ఆవును బందెల దొడ్డికి తరలించిన అధికారులు, మేత వేయకుండా రోజుల తరబడి ఉంచినందున సుమారు రూ.60వేల విలువైన చూడి ఆవు మృతిచెందిందని ఆవేదన వ్యక్తం చేశారు.

పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య

సూర్యాపేటక్రైం, జూలై 29: సూర్యాపేట జిల్లా కేంద్రంలో 10వ తరగతి విద్యార్థి ఆదివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట పట్టణంలోని నెహ్రూనగర్‌లో నివసించే రాజు-సంధ్య దంపతుల కుమారుడు అక్షిత్(15) పెన్‌పహాడ్ మండలంలోని అనాజిపురం శివారులోని గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు రెండు రోజులు (ఆది, సోమవారం) సెలవులు రావడంతో ఇంటికి వచ్చాడు. తండ్రి రాజు జిల్లా కేంద్రంలోని ఒక హోటల్‌లో పనిచేస్తుండగా, తల్లి సంధ్య ఏఎన్ఎంగా పనిచేస్తుంది. తల్లిదండ్రులు ఆదివారం విధులకు వెళ్లారు. రాత్రి ఇంటికి వచ్చే సరికి అక్షిత్ ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. విద్యార్థి ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. ఈ విషయాన్ని పాఠశాల ఉపాధ్యాయులకు సమాచారం ఇవ్వగా పలువురు ఉపాధ్యాయులు సూర్యాపేటలో అక్షిత్ మృతదేహానికి నివాళులర్పించారు. అక్షిత్ మృతదేహానికి సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు.

పర్సు దొంగిలించిన నిందితుడి అరెస్టు

నేరేడుచర్ల, జూలై 29: సూర్యాపేట జిల్లా నేరేడుచర్లలో మహిళ పర్సు కొట్టేసిన నిందితుడు సంపంగి రవి(28)ని పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ రవీంద్రనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి మండలానికి చెందిన సంపంగి రవి ఈనెల 28న నేరేడుచర్లలో ఓ మహిళ ఆర్టీసీ బస్సు ఎక్కుతుండగా ఆమె సంచిలో నుంచి నుంచి పర్సు దొంగతనం చేసి పట్టుబడ్డాడు. దొంగిలించిన సొత్తును నిందితుడి నుంచి స్వాధీనం చేసుకుని, హుజూర్‌నగర్ కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. నిందితుడిపై గతంలో11 కేసులు ఉన్నాయని, జైలుకు కూడా వెళ్లి వచ్చాడని ఎస్ఐ తెలిపారు.

కానిస్టేబుల్ నాగరాజు సేవలు మరువలేనివి

● నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



అయిటిపాములలో కానిస్టేబుల్ నాగరాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

కట్టంగూరు, జూలై 29: కానిస్టేబుల్ చెవుగోని నా గరాజు సేవలు మరువలేనివి ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మోత్కూర్ మండలం జానకీపురం వద్ద జరిగిన సిమీ ఉగ్రవాదుల దాడిలో మండలంలోని రసూల్‌గూడెం గ్రామానికి చెందిన కానిస్టేబుల్ నాగరాజు అసువులుబాసిన విషయం విదితమే. నాగరాజు జయంతి సందర్భంగా మండలంలోని అయిటిపాముల వద్ద ఏర్పాటు చేసిన విగ్రహానికి సోమవారం ఎమ్మెల్యే వీరేశం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కట్టంగూరు ఎస్ఐ ఎన్.శ్రీను, నాయకులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, మాజీ జడ్పీటీసీ మాద యాదగిరి, నాయకులు బెజవాడ సైదులు, బెజవాడ రామకృష్ణ, లతీఫ్, మిట్టపల్లి శివ, మర్రి రాజు, అంజన్‌కుమార్, స్వామి, జానీ పాల్గొన్నారు.

ఇళ్లు నిర్మించుకున్న వారికి పొజిషన్ పట్టాలు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు వీరస్వామి

నల్లగొండటౌన్, జూలై 29: నల్లగొండ పట్టణంలోని సాగర్ రోడ్డులో గల ముత్యాలమ్మ కాలనీలో ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకొని నివసిస్తున్న వారందరికీ పొజిషన్ పట్టాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బు వీరస్వామి డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో కొందరికే జీవో నెం 58, 59 ద్వారా పట్టాలు ఇచ్చారని తెలిపారు. ఫలితంగా అనర్హులు సైతం అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగా అర్హులైన అనేక మంది ఇంకా మిగిలిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా మంత్రి చొరవ తీసుకొని అర్హులైన వారందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంతేకాకుండా దరఖాస్తు చేసుకున్న వారికి త్వరితగతిన రేషన్‌కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు ఇవ్వాలని కోరారు. మహిళలకు క్యాంటీన్లు ఏర్పాటు చేసుకోవడానికి ఆర్థికసహాయం అందించి వడ్డీలేని రుణాలు ఇవ్వాలన్నారు. అసంతృప్తిగా ఉన్న శ్మశాన వాటికలను ప్రహరీలను నిర్మించాలని కోరారు. సమావేశంలో సీపీఐ పట్టణ నాయకులు విశ్వనాధుల లెనిన్‌బాబు, పుట్టమేల సుజాత, కౌసల్యానాయక్, నుస్రిత్‌బేగం, సైదమ్మ, మాధవి, బి. శంకరమ్మ, టి. రేణుక, జి. కుమారి, రాములమ్మ, హైమావతి, రంగమ్మ, వీరయ్య, నసీరుద్దీన్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

మర్రిగూడ, జూలై 29: సీజనల్ వ్యాధులు, జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నాంపల్లి పీహెచ్‌సీ డాక్టర్ దువ్వా నవీన్ అన్నారు. పారిశుధ్య సమస్య కారణంగా నాంపల్లి మండలంలోని నామానాయక్ తండాలో విషజ్వరాలు ప్రబలుతన్న విషయాన్ని తెలుసుకున్న ఆయన గ్రామాన్ని సందర్శించారు. సీజనల్ జ్వరాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. ఈ నేపథ్యంలో మంగళవారం నాంపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, జ్వర బాధితులు గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఎండిన చెట్టు



ప్రమాదకరంగా మారిన పచెట్టు

మునుగోడు రూర ల్, జూలై 29: మండ ల పరిధిలోని కచలాపు రం గ్రామంలో హనుమాన్ టెంపుల్ వద్ద ఎం డిపోయిన వేపచెట్టు ప్ర మాదకరంగా మారింది. ఇటీవల రోడ్డు వైపు కొమ్మలు వచ్చాయని సం బంధిత అధికారులు కొ మ్మలను తొలగించారు. దీంతో చెట్టు ఒకవైపు ఒరిగి ప్రమాదకరంగా మారింది. సెలవుల సమయంలో విద్యార్థులు, చిన్న పిల్లలు ఎండిన చెట్టు పరిసర ప్రాంతాల్లోనే ఆటలాడుతుంటారు. వృద్ధులు ప్రతీరోజు చెట్టు వద్ద ఉన్న దిమ్మపైన కూ ర్చొని సేద తీరుతుంటారు. గాలి వచ్చినప్పుడు ఈ చెట్టు ఎవరి మీద పడుతుం దోనని చుట్టుపక్కల ప్రాంతాల వారు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ చూపి చెట్టును పూర్తిస్థాయిలో తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

హరీష్‌రావు కోమటిరెడ్డికి క్షమాపణ చెప్పాలి

కేతేపల్లి, జూలై 29: తెలంగాణ కోసం మంత్రి పదవిని త్యాగం చేసిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి హరీష్‌రావు క్షమాపణలు చెప్పాలని టీపీసీసీ ముస్లిం మైనార్టీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎండీ.యూసుఫ్ జానీ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ ఓటమితో అడుగంటి హరీష్‌రావుకు మతిభ్రమించినట్లుందని విమర్శించారు. కేసీఆర్ తీసుకున్న తప్పుడు నిర్ణయాలను ఏనాడూ ప్రశ్నించని హరీష్‌రావు తెలంగాణ కోసం వందలాది విద్యార్థుల బలిదానాలకు చలించి మంత్రి పదవిని వదిలిన వెంకట్ రెడ్డిని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. విలువలతో కూడిన రాజకీయా లు చేసే వెంకట్‌రెడ్డికి హరీష్‌రావు క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

తాగునీటి కోసం అవస్థలు

● అభంగాపురంలో ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు

● పట్టించుకోని అధికారులు



గ్రామపంచాయతీ ట్రాక్టర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్న సిబ్బంది

మాడ్గులపల్లి, జూలై 29: మాడ్గులపల్లి మండలంలోని అభంగాపురంలో గ్రామస్థులు వారం రోజులుగా తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి నీటిని సరఫరా చేసే పెద్దదేవులపల్లిలోని మిషన్ భగీరథ ప్లాంట్ మరమ్మతు పనులు చేస్తుండటంతో వారం రోజులుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో మూడు బోరుబావులు ద్వారా నీటిని సరఫరా చేసేవారు. ప్రస్తుతం భూగర్భజలాలు అడుగంటిపోవడంతో బోరుబావులు పోయడం లేదు. దీంతో చేసేదేమీ లేక గ్రామంలోని ఓ రైతు బోరుబావి నుంచి నీరు అందించేందుకు గత ఏప్రిల్, మే, జూన్, జూలై చివరివరకు నీరందించినా సరిపోవడం లేదు. అంతేకాక సాగు పనులు మొదలవడంతో నీటిని సరఫరాలో ఇబ్బందులు తలెత్తాయి. గ్రా మంలో నీటి సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అభంగాపురం గ్రామంలో వెయ్యి మందికి పైగా జనాబా ఉన్నారు. నీటి సమస్యను పరిష్కరించేందుకు గ్రామంలో నీటి ట్యాంకరుతో సరఫరా చేస్తున్నారు. కానీ గ్రామస్థుల అవసరాలు తీర్చలేకపోతున్నాయి. గ్రామానికి మిషన్ భగీరథ నీరు వారం రోజులుగా రాకపోవడంతో చేసేదేమీ లేక గ్రామస్థులు వ్యవసాయ బావుల వద్ద నీటిని తెచ్చుకొని అవసరాలు తీర్చుకుంటున్నారు.



రైతు పొలంలోని బోరు నుంచి నీటిని తెచ్చుకుంటున్న గ్రామస్థులు

సమస్యను పరిష్కారానికి కృషి

పెద్దదేవులపల్లిలోని మిషన్ భగీరథ ప్లాంట్ మరమ్మతు పనులు జరుగుతున్నాయి. ఏడు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. గ్రామపంచాయతీ ట్రాక్టర్ ద్వారా గ్రామస్థులకు తాగునీటిని సరఫరా చేస్తున్నాం.

జిలకరకుంటతండాలో ఘనంగా తీజ్ వేడుకలు

దామరచర్ల, జూలై 29: మండలంలోని పడమటికుంటతండాలో తీజ్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. తీజ్ సందర్భంగా పెళ్లికాని గిరిజన యువతులు బుట్టలో గోధుమ విత్తనాలు చల్లి మొలకలు వచ్చే వరకు నీటిని చల్లుతారు. మొలకెత్తిన బుట్టలను ప్రత్యేక వస్త్రధారణతో ఆడిపాడి సమీప వాగులు, చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఈ వేడుకల్లో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ పాల్గొని మాట్లాడారు. తీజ్ వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని, గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, మాజీ ఎంపీపీ ధీరావత్ నందినిరవితేజ, నాయకులు కొర్ర నాగునాయక్, కొమ్ము దాసు, మాలోతు శివకుమార్‌నాయక్, హతీరాం నాయక్, కోట ఈశ్వరయ్య, కిషన్‌నాయక్, శ్రీనునాయక్, బాలునాయక్, రూపావత్ శివ, అశోక్‌కుమార్, వినోద్‌కుమార్, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



తీజ్ వేడుకల్లో పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్

డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం మోపుతాం

● నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి



డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ క్రైం, జూలై 29: డ్రగ్స్, గంజాయిపై అవగాహ న కల్పిస్తూ ఎస్పీ శరత్‌చంద్రపవార్ ఆదేశాల మేరకు ఉక్కుపాదం మోపుతామని నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి అన్నా రు. నల్లగొండ సబ్ డివిజన్‌లోని అన్ని పోలీస్ స్టేషన్ల ఆధ్వర్యంలో యువతకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎక్కడైనా గంజాయి, డ్రగ్స్, మాదక ద్రవ్యాలు సేవిస్తున్నా, విక్రయిస్తున్నట్లు సమాచారం ఉన్నా వెంటనే డయల్ 100, సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. గంజాయి, డ్రగ్స్, మాదక ద్రవ్యాల నివారణకు ప్రజలు సహకరించాలని సూచించారు.

గంజాయి, డ్రగ్స్‌తో పాటు అసాంఘిక కా ర్యకలాపాలపై కూడా దృష్టి సారించామని, గంజాయి, డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దేందుకు చర్యలు ప్రారంభించామన్నారు. యు వత, కళాశాలల్లో, యూనివర్సిటీ స్థాయితో పాటు పలు విద్యాసంస్థల్లో కూడా అవగాహన కల్పించేందుకు ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని, ప్రజలు, యువత సహకరించాలని కోరారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు : సీఐ

దేవరకొండ: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తీసుకుంటామని దేవరకొండ సీఐ నర్సింహులు హెచ్చరించారు. దేవరకొండలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మీనాక్షి సెంటర్, తాటికోలు రోడ్డుల్లో విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించామని, ఎలాంటి పత్రాలు లేకుండా నడుపుతున్న పది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పోలీస్‌శాఖ సూచించిన నియమ, నిబంధనలు పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ లైసెన్స్ కలిగి ఉండాలని, వాహనాల పత్రాలు కలిగి ఉండాలన్నారు.

త్రిపురారం: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వీరశేఖర్ హెచ్చరించారు. ఆదివారం రాత్రి త్రిపురారం మండల పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న పలువురిని గుర్తించి కేసు నమోదు చేశారు. వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ వీరశేఖర్ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్య తాగి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే ఆ వాహనాలను సీజ్ చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని విరమించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా దేవేందర్‌రెడ్డి

దేవరకొండ, జూలై 29: మధ్యాహ్న భోజన పథకంలో సీఎం రేవంత్‌రెడ్డి సెంట్రలైజ్ కిచెన్ విధానాన్ని విరమించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. దేవరకొండ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఏఐటీయూసీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన కొండగల్ నియోజకవర్గం లో హరేరామ హరేకృష్ణ ప్రతినిధులతో చర్చించి అమలు చేయనున్న సెంట్రలైజ్‌డ్ కిచెన్ విధానంతో వల్ల వంట కార్మికులు వీధినపడే ప్రమాదం ఉందని అన్నారు. 22 సంవత్సరాలుగా మధ్యాహ్న భోజన పథకం ద్వారా కార్మికులు వంటలు చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నారని అన్నారు. వంట కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేసి వేతనాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. ఈ నెల 31వ తేదీన ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి, డివిజన్ అధ్యక్షుడు నూనె వెంకటేశ్వర్లు, జూలూరి వెంకట్రాములు, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు జంగమ్మ, మల్లయ్య, ధనలక్ష్మి, శోభారాణి పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలి

తిప్పర్తి, జూలై 29: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఉద్యమకారుల సంఘం మండల అధ్యక్షుడు బొడ్డుపల్లి రామకృష్ణ అన్నారు. ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ పిలుపు మేరకు సోమవారం తిప్పర్తి మండలం పరిధిలోని సిలార్‌మియాగూడెంలో గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉద్యమకారులను పట్టించుకోలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలో భాగంగా తెలంగాణ ఉద్యమకారులను అన్ని విధాలా ఆదుకుంటామని చెప్పారని గుర్తు చేశారు. ప్రతీ ఉద్యమకారుని కుటుంబానికి 250 గజాల ఇంటి స్థలంతో పాటు పింఛన్ అమలుచేసి ఉద్యోగ భద్రత కార్డులను అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించి అమలుచేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు చెదురుపల్లి దయాకర్, లొడంగి సత్యనారాయణ, మండల యాదగిరి, చెదురుపల్లి సంపత్ పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పద్య రచన పోటీలో ఉత్తరాపల్లికి పురస్కారం



గుర్రం జాషువా పురస్కారం అందుకుంటున్న ఉత్తరాపల్లి

నార్కట్‌పల్లి, జూలై 29: మండలంలోని మాండ్ర గ్రామానికి చెందిన ఉత్తరాపల్లి నర్సింహాచార్యులకు అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ పద్య రచన పోటీలో గుర్రం జాషువా పురస్కారం ప్రకటించింది. పద్మశ్రీ గుర్రం జాషువా వర్థంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తెనాలిలోని ఎన్జీవో కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో నర్సింహాచార్యులకు సంస్థ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ పెద్దిటి మోహన్ పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో జీఎస్ రాజు, జ్యోతి, హరికృష్ణ, కె.చక్రవర్తి, రామలింగారెడ్డి, సుబ్రహ్మణ్యం, రజని, రమేషశ్, విజయ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలి



వంట గదిలో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎస్ఎస్‌యుఐ నాయకులు

అడవిదేవులపల్లి, జూలై 29: మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థులకు సిబ్బంది నాణ్యమైన భోజనం అందించాలని ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు గొడుగు హనుమయ్య అన్నారు. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను సోమవారం ఆయన సందర్శించి విద్యార్థినులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు తమకు భోజనం సరిగా అందించడం లేదని చెప్పడంతో భోజనాన్ని పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులకు ప్రతీ రోజు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యనభ్యసించే పేద విద్యార్థుల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు పోషమల్ల నరేష్, రమేష్, ఉదయ్, ఇండ్ల నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో టీడీపీ జెండా ఎగురవేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ముద్దం శ్రీనివాస్

మర్రిగూడ, జూలై 29: సంస్థాగత ఎన్నికల్లో గ్రామగ్రామాన టీడీపీ జెండాను ఎగురవేయాలని ఆ పార్టీ తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముద్దం శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో టీడీపీకి పూర్వవైభవం వస్తుందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి పనులే నేడు కనిపిస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యకర్తలు పార్టీని బలోపేతం చేయడానికి సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు దోమల వెంకటయ్య, నాయకులు యాదయ్య, కృష్ణ, అనిల్ పాల్గొన్నారు.

శ్రీనగర్ కాలనీలో మెహందీ కార్యక్రమం



గోరింటాకు చూపిస్తున్న మహిళలు

నల్లగొండ క్రైం, జూలై 29: నల్లగొండ పట్టణంలోని పానగల్ రోడ్డులో ఉన్న శ్రీనగర్‌కాలనీలో మహిళలు చేతికి గోరింటాకు వేసుకుని మెహందీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆషాఢ మాసం ముగింపు సందర్భంగా కాలనీలోని మహిళలంతా ఒకచోట చేరి ప్రతి ఏడాది ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు వలిశెట్టి జ్యోతి, రాజేశ్వరి, సుజాత, మంగమ్మ, మంజుల, లక్ష్మి, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీవీ బ్యాంకు మేనేజర్‌గా జామ్లా



జామ్లా

శాలిగౌరారం, జూలై 29: శాలిగౌరారం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ ఏపీజీవీబీ బ్యాంకు మేనేజర్‌గా ముడావత్ జామ్లా సోమవారం బాధ్యతలు స్వీకరిం చారు. ఇక్కడ మేనేజర్‌గా పని చేసిన ప్రవీణ్‌కుమార్ హన్మకొండకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా మేనేజర్ జామ్లా మాట్లాడుతూ బ్యాంకు సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సంక్షిప్త సమాచారం...

శాలిగౌరారం: మండలంలోని వంగమర్తి గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన భైరబోయిన సైదులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. టీఆర్ఎస్ పార్టీ నాయకులు సకినాలు నర్సయ్య, మాచర్ల భాస్కర్, చిలుకూరి లక్ష్మణ్, రూపని యాదగిరి, రాయవరపు గోపి, పోలేపాక వెంకటనర్సు, రూపని సునీల్, పెంటగోని శ్రీను, బూత్కూరి అంతిరెడ్డి కలిసి మొత్తం రూ.12,200, 50 కేజీల బియ్యం తమవంతు సాయంగా మృతుని కుమారుడు భైరవ వెంకన్నకు అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గద్దపాటి చందు, ఐలపాక శ్రీను, బెల్లి ఎల్లయ్య, రాయరపు వెంకన్న, చింటు, పోలేపాక వెంకన్న, నరసింహ, వీరయ్య, సైదులు పాల్గొన్నారు.

శాలిగౌరారం: మండలంలోని శాలిలింగోటం సంఘం గ్రామ శాఖ అధ్యక్షుడిగా లోడే సత్తయ్యగౌడ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సత్తయ్య గౌడ్ మాట్లాడుతూ గౌడ కులస్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, తనను అధ్యక్షుడిగా ఎన్నుకున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

చింతపల్లి: నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు శివర్ల రమేష్‌యాదవ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా నిరుద్యోగులకు భృతి కల్పించకుండా, ఉపాధ్యాయ పోస్టులు పూర్తిస్థాయిలో భర్తీ చేయకుండా కాలయాపన చేస్తోందన్నారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు.

చందంపేట: రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా ప్రతీ ఒక్కరికి రుణమాఫీ చేయాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బోడ శ్రీశైలం డిమాండ్ చేశారు. ఎన్నికల హామీ మేరకు ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని అన్నారు. పదేళ్ల నుంచి రేషన్‌కార్డులు మంజూరు చేయకపోవడంతో అర్హులకు అన్యాయం జరుగుతుందని అన్నారు. పింఛన్ మొత్తాన్ని కూడా పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు పాత్లావత్ అంజనేయులు, శ్రీరామదాసు సతీష్‌చారి, వినోద్, వెంకట్, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మిర్యాలగూడ: అనారోగ్య సమస్యలతో మృతి చెందిన క్రికెట్ క్రీడాకారుడికి మిత్రులు కన్నీటి వీడ్కోలు పలికారు. పట్టణంలోని సీతారాంపురంనకు చెందిన నిరుపేద కుటుంబానికి చిలువేరు హరికృష్ణ (33) ఆర్థిక పరిస్థితులు అనుకూలించక చదువు మధ్యలో ఆపేసి ప్రైవేట్ ఉద్యోగిగా కాలం వెల్లదీస్తున్నాడు. తీవ్ర అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. సమాచా రం అందుకున్న మిర్యాలగూడ మార్నింగ్ క్రికెట్ టీమ్ సభ్యులు సోమవా రం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. సీనియర్ క్రికెట్ ప్లే యర్ పురం వెంకట్, రవి, గణేష్, వెంకన్న, నందికొండ రవి, రాజశేఖర్ ఆధ్వర్యంలో పలువురు క్రీడాకారులు మిత్రుని దహన సంస్కారాల కోసం రూ.23 వేలు సేకరించి మృతుడు హరికృష్ణ సోదరునికి అందజేశారు.

వేములపల్లి: మండల కేంద్రానికి చెందిన సింగిల్‌విండో మాజీ చైర్మన్ పందిరి ప్రతాప్ కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్న ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అదేవిధంగా ఎన్‌బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నల్లమోతు సిద్దార్థ సైతం వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో టీపీసీసీ సభ్యుడు చిరుమర్రి కృష్ణయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు రావు ఎల్లారెడ్డి, నాయకులు రాంరెడ్డి, పెద్ద వెంకన్న, నాగవెల్లి మధు, వినోద్, గిరి, గురవయ్య పాల్గొన్నారు.

తిరుమలగిరి(సాగర్): మండలంలోని పలువురు నిరుపేదలకు బుసిరెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పాండురంగారెడ్డి ఆర్థికసాయం అందజేశారు. మండలంలోని నెల్లికల్లు గ్రామంలో ఆర్థికంగా వెనుకబడిన కనకరాజు ఈదమ్మ, అబ్దుల్ సమద్, మేలోజు సౌభాగ్యమ్మ, కక్కెర కాశయ్యలకు రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. అంతేకాకుండా నాయకుని తండాలో నిర్మాణంలో ఉన్న చర్చికి రూ.25వేల విరాళాన్ని ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ యడవెల్లి దిలీప్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకుడు మెరావత్ మునినాయక్, మాజీ సర్పంచులు పమ్మి జనార్ధన్‌రెడ్డి, నడ్డి లింగయ్య, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: పట్టణ సాంస్కృతిక కళాకేంద్ర సభ్యులు, ప్రముఖ కళాకారులు పులి కృష్ణమూర్తి, ఫుల్లాభట్ల లక్ష్మీనారాయణశర్మను ఘనంగా సన్మానించారు. పట్టణంలో జాతీయ, రాష్ట్రస్థాయి పద్యనాటక, రంగస్థల నాటకోత్సవాలను నిర్వహించడంతో పాటు కనుమరుగవుతున్న కళలకు జీవం పోస్తున్న ఇరువురిని శివానీ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. రాష్ట్ర రాజధానిలోని త్యాగరాజ ధ్యాన సభలో ప్రముఖ సంఖ్యా శాస్త్రవేత్త దైవాజ్ఞశర్మ, వినుకొండ ఎమ్మెల్యే జీవీ అంజనేయులు సన్మానించారు. కార్యక్రమంలో శివానీ ఆర్ట్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు బాపనపల్లి పరమేష్, రాంచందర్‌రావు, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

దామరచర్ల: జిల్లాలోని ఎస్టీ గురుకులాల్లో నిబంధనలకు విరుద్ధంగా ఇతర జిల్లాలకు చెందిన విద్యార్థులతో సీట్లు భర్తీ చేయడం తగదని ఎల్‌హెచ్‌పీఎస్ నియోజకవర్గ ఆడోతు నాగునాయక్ అన్నారు. ఈ ప్రక్రియ వల్ల సొంత జిల్లా విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. వెంటనే వారిని వారి జిల్లాలకు తిరిగి పంపాలని లేనిచో ఉద్య మాలు చేపడతామని హెచ్చరించారు. మండలకేంద్రంలోని ఎస్టీ గురుకుల పాఠశాలలో మెజారిటీ విద్యార్థులు ఇతర జిల్లా వారేనని, వారి వద్ద నుంచి భారీ మొత్తంలో ఆర్‌సీవో, ప్రిన్సిపాల్ వసూలు చేసి వారికి సీట్లు కేటాయిస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు ఆయన తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని స్త్రీ సమాజ కూడిక సంస్థ 12వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకురాలు రమాబాయి మాట్లాడుతూ మహిళలకు సేవలందించేందుకు సంస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ధీరావత్ హన్యానాయక్, సుధారాణి, జనార్ధన్, మరియమ్మ పాల్గొన్నారు.

● అద్వితీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృద్ధ, దివ్యాంగులకు దుప్పట్లు, ఆహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ మేరావత్ శివనాయక్ మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.